సాక్షి అనకాపల్లి

శనివారం । 2 । నవంబర్ । 2024



క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



పోర్టులో ఏక్తా దివస్

విశాఖ సిటీ: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విశాఖ పోర్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 2న 1 మి.మీ, 3న 4, 4న 2, 5న 1 మి.మీ. వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

పటేల్‌కు ఘన నివాళి



పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో దయానిధి, డీపీవో శిరీషారాణి

తుమ్మపాల: తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్లే సమైక్య భారతం సాధ్యమైందని, స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి అనేక సంస్థానాలుగా ఉన్న మన దేశాన్ని ఐక్యం చేయడంలో ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిదని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అన్నారు. పటేల్ జన్మదిన వేడుకలను కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద డీఆర్వో జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులంతా జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో దయానిధి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో పటేల్ నిర్వహించిన పాత్రకు, ఆయన నిర్ణయాల్లో దృఢత్వానికి గుర్తింపుగా ఉక్కు మనిషిగా పేరుగాంచారన్నారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆర్.శిరీషారాణి, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.నాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి



గంగిరెడ్ల శంకర్రావు (ఫైల్)

రాంబిల్లి (యలమంచిలి): దిమిలి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గంగిరెడ్ల శంకర్రావు (39) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. దిమిలి గ్రామానికి చెందిన శంకర్రావు జమ్మూకశ్మీర్ శ్రీనగర్ ఆర్మీలో హవల్దారుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటు వచ్చి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్రావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మరో ఏడాదిలో పదవీ విరమణ చేయవలసిన తరుణంలో ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. శంకర్రావు మృతదేహాన్ని ఆర్మీ అధికారులు విశాఖపట్నం ఏఆర్వో కార్యాలయానికి ఆదివారం తీసుకువస్తారని, అనంతరం అధికారిక లాంఛనాలతో దిమిలి గ్రామంలో సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని ఆర్మీ అధికారుల నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-చెన్నై ఎగ్మోర్ (08557) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 2, 9, 16, 23, 30వ తేదీల్లో, చెన్నై ఎగ్మోర్-విశాఖపట్నం(08558) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 3, 10, 17, 24, డిసెంబరు 1వ తేదీల్లో ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు. - విశాఖపట్నం-కొల్లాం (08539) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 6, 13, 20, 27వ తేదీల్లో, కొల్లాం -విశాఖపట్నం(08540) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 7, 14, 21, 28వ తేదీల్లో ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.

ఉచిత గ్యాస్ పంపిణీ ప్రారంభం



మహిళకు గ్యాస్ సిలిండర్ అందిస్తున్న హోంమంత్రి అనిత

నర్సీపట్నం/పాయకరావుపేట/తుమ్మపాల: సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం జిల్లాలో శుక్రవారం ప్రారంభమయింది. శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేటలో ఈ పథకాన్ని ప్రారంభించి, మహిళలకు సిలిండర్లు అందజేశారు. కలెక్టర్ విజయ కృష్ణన్ అనకాపల్లి గాంధీనగరం వీధిలోని మావూరి రమణమ్మ అనే లబ్ధిదారు ఇంటికి వెళ్లి, సిలిండర్ అందించి, వారి ఇంటిలో స్వయంగా టీ తయారు చేసి లబ్ధిదారుకు అందించారు. జిల్లాలో 3 లక్షల 60 వేల 125 మందికి దీపం పథకం కింద ప్రయోజనం చేకూరనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్.మూర్తి, ఐవోసీఎల్ కంపెనీ మేనేజర్ వి.గోపాల్, తహసీల్దార్ బి.వి జయకుమార్ పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పెన్షన్ కోసం పాట్లు

ఈనెల కూడా పింఛనుదార్లకు ప్రయాస తప్పలేదు. ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తామని చెప్పిన అధికారులు గ్రామాల్లో ఒక చోటకు రప్పించి అందజేసే ప్రయత్నం చేశారు. వారి నిర్దయకు తోడు మధ్యాహ్నం వరకు సర్వర్ మొరాయించడంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు అష్టకష్టాలు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సామాజిక పింఛన్‌దారులకు ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమస్య మొదలైంది.



- ప్రచారానికే పరిమితమైన ఇంటి వద్ద పంపిణీ
- ఒకే చోటకు రప్పించి అందజేస్తున్న సిబ్బంది
- సర్వర్ పనిచేయక గంటల తలబడి నిరీక్షించిన లబ్ధిదారులు



గొలుగొండ మండలం ఉగ్గంపేటలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

కశింకోట/ఎస్.రాయవరం/గొలుగొండ/దేవరాపల్లి/మాడుగుల రూరల్/తుమ్మపాల:

నవ్వుతూ పలకరించేవారు.. యోగక్షేమాలు అడిగి కుశల ప్రశ్నలు వేసేవారు.. గ్రామ వలంటీర్లు ఆత్మబంధువుల్లా ఇంటికే వచ్చి పింఛన్లు అందజేసేవారు. అదంతా గతం. ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తున్నట్టు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. గ్రామానికి వెళ్లిన సిబ్బంది అందరినీ ఒకే చోటకు రప్పించి అందజేస్తున్నారు. వారు వచ్చే వరకు పింఛనుదారులు వేచి ఉండాల్సి వస్తోంది. శుక్రవారం ఉదయం నుంచే లబ్ధిదారులు ఎదురుచూస్తున్నా.. కాసేపటికే సర్వర్లు మొరాయించాయి. మధ్యాహ్నం వరకు సమస్య తీరకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. కశింకోట మండలంలో శుక్రవారం సర్వర్ ఉదయం, మధ్యాహ్నం మొరాయించడంతో వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బంది చెందారు. సాయంత్రం కొంతమందికి పింఛన్ అందజేసి, మిగతా వారికి శనివారం పంపిణీ చేస్తామని సిబ్బంది వాయిదా వేశారు. కశింకోటలో ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల ప్రాంతం వరకు సర్వర్ పని చేయలేదు. దీంతో పింఛన్ సొమ్ము కోసం పింఛన్‌దారులు తమ ఇళ్ల వద్ద, సచివాలయం, పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది.

- ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లి గ్రామంలో పింఛన్ కోసం క్యూ కట్టే పరిస్థితి నెలకొంది. గ్రామంలో అధికారులు, అధికార పార్టీ నాయకులు ఒక చోట కూర్చొని నడవలేని స్థితిలో ఉన్న అవ్వా తాతలతో క్యూకట్టించి, పడిగాపులు కాయించారు. జగన్‌బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామ వలంటీర్ ఇంటికి వచ్చి చక్కగా పలకరించి పింఛన్ నగదు ఇచ్చి వెళ్లేవారని గుర్తుకు తెచ్చుకున్నారు.
- గొలుగొండ మండలంలో కూడా మధ్యాహ్నం రెండు గంటల వరకు సర్వర్ పనిచేయకపోవడంతో గ్రామాల్లో పింఛన్‌దార్లు రోడ్లపై ఉండాల్సి వచ్చింది.
- దేవరావల్లి మండలంలో సర్వర్ పనిచేయక మండుటెండలో సైతం దివ్యాంగులు, వృద్ధులు సచివాలయాల వద్దకు చేరుకొని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు పింఛన్‌దార్లకు కచ్చితమైన సమాచారం అందించక పోవడంతో వృద్ధులు, దివ్యాంగులు నరకయాతన అనుభవించారు.
- మాడుగుల రూరల్ మండలంలో ఉదయం 8.30 గంటల తర్వాత సర్వర్ పనిచేయకపోవడంతో పింఛనుదార్లు తీవ్ర అవస్థలు పడ్డారు. వీరనారాయణం సచివాలయం వద్ద లబ్ధిదారులు మధ్యాహ్నం 12.15 గంటల వరకు వేచి ఉన్న తర్వాత సర్వర్ బాగుపడింది.



దేవరాపల్లి సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛనుదార్లు



ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లిలో పింఛన్ కోసం ఓ ఇంటి వద్ద పడిగాపులు



కశింకోట మండలం కన్నూరుపాలెంలో మహిళా పింఛనుదార్ల నిరీక్షణ

94 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం 94 శాతం పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. జిల్లాలో మొత్తం 2,59,778 మంది లబ్ధిదారులకు గాను మొదటి రోజు 2,42,487 మందికి రూ.99.99 కోట్ల నగదును పంపిణీ చేశామన్నారు.

సాయంత్రం అందుకున్నాను



సర్వర్ పనిచేయకపోవడంతో నాకు సాయంత్రానికి పింఛన్ పంపిణీ జరిగింది. పింఛన్ పంపిణీ కాకపోవడంతో సచివాలయానికి వెళ్లి వాకబు చేయగా సర్వర్ సమస్య అని చెప్పడంతో ఇంటికి వెళ్లాం. మళ్లీ సాయంత్రం సర్వర్ పనిచేయడంతో పింఛన్ సొమ్ము అప్పుడు అందుకున్నాం. ఈ వయసులో మాకు ఏమిటో ఈ కష్టాలు!

-కూండ్రపు అప్పలనాయుడు, కన్నూరుపాలెం

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో పార్శిల్ కార్యాలయం మూసివేత

అనకాపల్లి: స్థానిక రైల్వే స్టేషన్‌లో గల పార్శిల్ కార్యాలయాన్ని మూసివేశారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాలని రైల్వే ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో దేశవ్యాప్తంగా గల మాన్యువల్ కార్యాలయాలను మూసివేస్తున్నారు. దీనిలో భాగంగా అనకాపల్లి స్టేషన్లోని పార్శిల్ కార్యాలయం కూడా శుక్రవారం నుంచి మూతబడింది. వివిధ ప్రాంతాలకు పార్శిళ్లు పంపించేవారు ఇకపై విశాఖ లేదా సామర్లకోట రైల్వే స్టేషన్ల నుంచి మాత్రమే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. పార్శిల్ కార్యాలయాన్ని మూసివేయడంతో ఇక్కడ పనిచేస్తున్న 12 మంది కలాసీలకు ఉపాధి లేకుండా పోయింది. ఈ సందర్భంగా రైల్వే కళాసీలు కె.సత్తిబాబు, ఎన్.శ్రీను, పి.బుజ్జి, అప్పలరాజు, ఏడుకొండలు, పి.రమణ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా అనకాపల్లి రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నామని, కేంద్రాన్ని మూసివేయడంతో ఉపాధి కోల్పోయామని చెప్పారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ మీదుగా దేశంలో వివిధ ప్రాంతాలకు పార్శిళ్లు పంపే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు

విశాఖ సిటీ: గ్లోబ్ హీల్ 2025 అంతర్జాతీయ సదస్సుకు పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు సదస్సు ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ నిమాళి తక్షశిల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్ర విశ్వ విద్యాలయం కూడా భాగస్వామ్యం వహిస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు సంతకాలు చేసినట్లు వెల్లడించారు. శ్రీలంకకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏడు దేశాలకు చెందిన 13 విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో బ్యాంకాక్‌లోని అంబాసిడర్ హోటల్లో ఈ అంతర్జాతీయ సదస్సు జరగనున్నట్లు వివరించారు. ఈ సదస్సులో పరిశోధకులు, హెల్త్ కేర్ నిపుణులు తమ పరిశోధన పత్రాలను ఈ నెల 26వ తేదీలోగా తమకు సమర్పించాలని సూచించారు.

దీపావళా.. కాలుష్య శాపావళా! -8లో

మార్టూరు స్కూల్ కమిటీ ఎన్నిక నిలిపివేత

- ఉత్తర్వులు జారీచేసిన డీఈవో



మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

తుమ్మపాల: మండలంలోని మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ ఎన్నికను నిలిపివేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాఠశాలలో గత ఆగస్టు నెలలో జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి కోట్ని సముద్రాలును కాకుండా ఓటమి చెందిన కూటమికి చెందిన అభ్యర్థిని హెచ్ఎం విజయ చైర్మన్‌గా నియమించడంతో ఎన్నికను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీకి చెందిన గెలుపొందిన అభ్యర్థి కోర్టును ఆశ్రయించారు. దీంతో తీర్పు వచ్చే వరకు చైర్మన్, కమిటీ ఎన్నికను నిలిపివేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మార్టూరు జిల్లా పరిషత్ పాఠశాలకు కమిటీ లేకుండా పోయింది. వివరాలు...

ఆగస్టు 17న మార్టూరు పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో తల్లిదండ్రులు చేతులెత్తి చైర్మన్‌గా కె.సముద్రాలును ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా సీహెచ్ కుమారి ఎన్నికయ్యారు. అయితే అధికారంలో ఉన్న తాముకాకుండా వైఎస్సార్‌సీపీకి చెందిన వారు గెలుపొందడంపై జీర్ణించుకోలేని ఓటమి చెందిన అభ్యర్థి పొల్నాటి మహేశ్వరావు హెచ్ఎంపై వత్తిడి తెచ్చారు. దీంతో రహస్యంగా అదే నెల 21న మరోసారి ఎన్నిక నిర్వహించి, చైర్మన్‌గా పొల్నాటి మహేశ్వరావు, వైస్ చైర్మన్‌గా వి.వి.లక్ష్మి ఎన్నికైనట్లు జిల్లా అధికారులకు నివేదిక పంపించారు. హెచ్ఎం వైఖరిని వ్యతిరేకిస్తూ మండల, జిల్లా అధికారులకు సముద్రాలు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు సైతం కూటమి నాయకుల ఒత్తిడికి తలొగ్గి గెలుపొందిన అభ్యర్థి ఫిర్యాదుపై విచారణ జరిపి, న్యాయం చేసే సాహసం చేయలేకపోయారు. దీంతో సముద్రాలు హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి నివేదికను హైకోర్టుకు నివేదించారు. కోర్టు తీర్పు వచ్చేంత వరకు చైర్మన్‌గా ప్రకటించిన అభ్యర్థి పొల్నాటి మహేశ్వరరావు, వైస్ చైర్మన్ వి.వి.లక్ష్మిల నియామకాన్ని నిలిపివేయాలని జిల్లా విద్యాశాఖ, సర్వ శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం.విజయ తెలిపారు.

మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- యూపీకి చెందిన యువకుడి మృతి
- కొత్తూరు నర్సింగరావుపేటలో ఘటన



కొత్తురులో సంఘటన స్థలం వద్ద క్లూస్‌టీం, (ఇన్‌సెట్) ఎన్టీఆర్ ఆస్పత్రిలో వినోద్‌కుమార్ మృతదేహం, ఫైల్ ఫొటోలు

సాక్షి, అనకాపల్లి: మద్యం మత్తులో జరిగిన ఘర్షణ ఒక యువకుడి ప్రాణాన్ని బలిగొంది. అనకాపల్లిలో జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు నర్సింగరావుపేటలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. వివరాలు...కొత్తూరులో గల ఏపీఐఐసీ పార్కులోని స్టీల్ పైప్స్ కంపెనీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వినోద్‌కుమార్(23), ఆయన సోదరుడు అమిత్‌కుమార్ మూడేళ్లగా విధులు నిర్వహిస్తున్నారు. అదే గ్రామంలో గల వైన్‌షాప్ వద్ద గురువారం రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో వినోద్‌కుమార్, సోదరుడు అమిత్‌కుమార్ మద్యం కొనుగోలు చేసి, అక్కడే తాగారు. అప్పటికే అక్కడే మద్యం సేవించి ఉన్న కొత్తూరు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులతో వీరికి గొడవ జరిగింది. దీంతో వైన్‌షాప్ సిబ్బంది ఇరువర్గాల వారినీ వారించి గొడవ పడితే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో ఇరు వర్గాల వారు వెళ్లిపోయారు. వినోద్‌కుమార్, అమిత్‌కుమార్ బైక్‌పై జాతీయ రహదారి పక్క నుంచి వెళుతుండగా..అదే సమయంలో మరో మార్గం నుంచి కొత్తూరు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు వచ్చి కర్రలతో దాడిచేశారు. వినోద్‌కుమార్(23) తలపై కొట్టడంతో రోడ్డు మీద కుప్పకూలిపోయాడు. అమిత్‌కుమార్‌ను కూడా తీవ్రంగా కొట్టి ఆ నలుగురు అక్కడ నుంచి వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి సమయంలో వినోద్‌కుమార్ మృతిచెందాడు. పోలీసులు మొదట రోడ్డు ప్రమాదంగా భావించినా.. తరువాత పూర్తి వివరాలు సేకరించి, వినోద్‌కుమార్‌పై దాడి చేశారని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డీఎస్పీ బి.అప్పారావు, క్లూస్‌టీమ్ సీఐలు అశోక్‌కుమార్, అల్లు స్వామినాయుడు శుక్రవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వైన్‌షాప్‌లో సిబ్బందితో పాటు సమీపంలో ఉన్న పాన్‌షాప్ యజమానిని విచారించారు. పక్కనే ఉన్న టైర్ల కంపెనీలో సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. దాడిచేసిన కొత్తూరు గ్రామానికి చెందిన నిందితులు నలుగురిలో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. మొత్తం వ్యవహారాన్ని అనకాపల్లి రూరల్ పోలీసులు గోప్యంగా ఉంచారు. పోస్టుమార్టం నిమిత్తం వినోద్‌కుమార్ మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఉంచారు.

నక్కపల్లి క్లస్టర్‌లో స్టీల్‌ప్లాంట్!

- ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ జాయింట్ వెంచర్ సుముఖత
- 2,640 ఎకరాల భూమి కేటాయించాలని ప్రభుత్వానికి దరఖాస్తు



పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ సేకరించిన భూమి

నక్కపల్లి: విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో క్లస్టర్‌గా ఉన్న నక్కపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రముఖ ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్.. జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ జాయింట్ వెంచర్ కంపెనీ మండలంలో రాజయ్యపేట సమీపంలో పోర్టు ఆధారిత ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసింది. కంపెనీ ఏర్పాటుకు అవసరమైన భూములు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. ప్రాజెక్టు కోసం 2,200 ఎకరాలు, టౌన్‌షిప్ అభివృద్ధి కోసం మరో 440 ఎకరాలు కేటాయించాలని మిట్టల్ గ్రూపు ప్రభుత్వాన్ని కోరింది. పోర్టు ఆధారిత ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సముద్ర తీరానికి అతి సమీపంలో ఉన్న రాజయ్యపేట ప్రాంతాన్ని కంపెనీ ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఉక్కు పరిశ్రమకు అవసరమైన భూములు గుర్తించాలని, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఏపీఐఐసీ ద్వారా అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. ఏడాదికి 7.30 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ కంపెనీ ఏర్పాటు చేయబోతున్నట్లు సమాచారం. మొదటి విడతలో 2,200 ఎకరాలు కేటాయించాలని మిట్టల్ గ్రూపు దరఖాస్తు చేసింది. సుమారు రూ.70 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం.

కంపెనీ మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదనలు

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం కంపెనీ కొన్ని ప్రతిపాదనలు చేసింది. ఉత్పత్తుల రవాణా, మార్కెటింగ్ కోసం జాతీయ రహదారి నుంచి వేంపాడు, కాగిత, న్యాయంపూడి మీదుగా ప్రాజెక్టు సైటు వరకు 4 లైన్ల కనెక్టివిటీ రోడ్డును నిర్మించాలి. సమీపంలో ఉన్న గుల్లిపాడు రైల్వే స్టేషన్ నుంచి ప్రతిపాదిత ప్రాజెక్టు వరకు రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలి. ముడిసరకు రవాణా కోసం 42 కిలోమీటర్ల పైపు లైను (కిరండూల్-విశాఖ) ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రెండోదశలో ఏర్పాటు చేయబోయే స్టీల్ ప్లాంట్ కోసం మరో 3,800 ఎకరాల భూములను కేటాయించాలని కంపెనీ ప్రభుత్వాన్ని కోరింది. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఏపీఐఐసీ ద్వారా మండలంలో రాజయ్యపేట, వేంపాడు, చందనాడ, అమలాపురం, డీఎల్‌పురం గ్రామాల పరిధిలో 4,314 ఎకరాలను సేకరించింది. నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లింపుల ప్రక్రియ దాదాపు పూర్తయింది. 3,874 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మిగిలిన విస్తీర్ణానికి సంబంధించి కోర్టు కేసులు, గ్రామకంఠాలు, పరిహారం, ప్యాకేజీ చెల్లింపుల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది.

భూ సేకరణకు కసరత్తు

ఆర్సెలార్ మిట్టల్ కంపెనీ కోరిన 2,200 ఎకరాలను సేకరించేందుకు రెవెన్యూ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, చినతీనార్ల, తదితర గ్రామాల పరిధిలో అందుబాటులో ఉన్న భూములను అధికారులు గుర్తిస్తున్నారు. విలేజ్ మ్యాప్‌ల ద్వారా భూములను పరిశీలిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ కోరిన భూములు సేకరించడానికి ఏపీఐఐసీ వారు ఫేజ్ 2 కింద భూసేకరణ కోసం 4 (1) నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో జిరాయితీ భూమి ఎంత, డీఫారం, ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయి అనే వివరాలు అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటయితే ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 20 వేలమందికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

గంజాయి కేసులో 15 ఏళ్ల జైలు



ముద్దాయి గోలారి మహేశ్వర్ అలియాస్ మహేష్

తుమ్మపాల: మండలంలో తుమ్మపాల చినబాబు కాలనీ వద్ద 44 కేజీల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన గోలారి మహేశ్వర్‌కు 10వ అదనపు జిల్లా కోర్టు 15 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందన్‌పూర్ మండలం బాడంగ్ గ్రామానికి చెందిన గోలారి మహేశ్వర్ అలియాస్ మహేష్ (20)ను ఎస్సై వి.చక్రధర్ ఆధ్వర్యంలో అనకాపల్లి టౌన్ పోలీసులు 2020 ఆగస్టు 28న అరెస్టు చేశారు. తుమ్మపాల గ్రామం చినబాబు కాలనీ వద్ద వాహన తనిఖీలు నిర్వహించి చోడవరం వైపు నుంచి అనకాపల్లి వస్తున్న అనుమానాస్పద ఆటోను ఆపుతుండగా అందులో ఉన్న ముగ్గురు నిందితులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో గోలారి మహేశ్వర్ అలియాస్ మహేష్ పోలీసులకు పట్టుబడగా మిగతా ఇద్దరు నిందితులు పరారయ్యారు. ఆటోను తనిఖీ చేయగా అందులో 44 కేజీల గంజాయి లభ్యమయింది. నిందితుడిని అరెస్టు చేసి, గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత సాక్ష్యాధారాలను బట్టి 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య ముద్దాయి గోలారి మహేశ్వర్‌కు 15 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా, జరిమానా కట్టని పక్షంలో మరో 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పీపీ వడ్డాది వెంకట్రావు, ఇన్‌చార్జ్ పీపీ సిహెచ్.వీరకృష్ణ వినిపించిన వాదనలు సమర్థిస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్‌వో ఎల్.భాస్కరరావు, ఎస్సై వి.చక్రధర్, పోలీసులు సిబ్బంది, పీపీలను అభినందించారు.

ఏయూలో రాష్ట్ర అవతరణ దినోత్సవం



తెలుగుతల్లి చిత్రపటం వద్ద ఏయూ ఆచార్యులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, సమైక్య భారతి, పశ్చిమ బెంగాల్ తెలుగు భాష ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏయూ తెలుగు విభాగంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చిత్తశుద్ధి, దేశభక్తి, గుండె ధైర్యం ప్రపంచ స్థాయిలో గొప్ప చరిత్రగా నిలిచిపోయిందన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాల్లో భాగంగా లైట్ సెట్టింగ్(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

యలమంచిలి రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి పంచరాత్రి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకు పట్టణంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఉత్సవాలకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం శ్రీకారం చుట్టారు. ఉత్సవ కమిటీకి చైర్మన్ వ్యవహరిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు భూలోకమాంబ అమ్మవారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు. అమ్మవారికి తొలిపూజ సంప్రదాయం ప్రకారం వైఎస్సార్‌సీపీ నేత ఆడారి శ్రీధర్(చిన్నా) దంపతులు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కూడా పంచరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. తులసీనగర్, దిబ్బిరోడ్డు కూడలి, పాతవీధి ఏరియాల్లో భారీ విద్యుత్ దీపాలంకరణలు, సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మళ్ల కొండబాబు, కర్రి జానకిరాం, పిల్లా రామకృష్ణ, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

దీపావళా.. కాలుష్య శాపావళా!

బాణసంచా పేలుళ్లు దద్దరిల్లాయి.. తారాజువ్వల వెలుగుల నడుమ మహానగరం మురిసిపోయింది. చిచ్చుబుడ్లు జిగేల్‌మనిపించాయి. కానీ కాలుష్య మేఘాలు ఊపిరి సలపనివ్వకుండా చేశాయి. కాలుష్యాన్ని పెంచే బాణసంచాపై ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో ప్రమాదకరమైన పొగ విశాఖను కమ్మేసింది. గతేడాది కంటే తక్కువ మోతాదులో బాణసంచా కాల్చినా గాలి నాణ్యత మాత్రం దారుణంగా పడిపోయింది. గతేడాది హరిత దీపావళి చేసుకోగా.. ఈసారి మాత్రం కాలుష్య దీపావళి పడగ విప్పి.. నగర వాసులను అవస్థలకు గురిచేసింది.

– సాక్షి, విశాఖపట్నం



అమాంతం పెరిగిన కాలుష్యం

- ప్రమాదకర స్థాయికి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- గురువారం రాత్రి 9 గంటలకు 500 కి చేరుకున్న ఏక్యూఐ
- సాధారణంగా 110–130 మధ్యలో నగర ఏక్యూఐ
- నాసిరకం టపాసులతో కమ్ముకున్న కాలుష్యం
- కాలుష్యాన్ని పెంచే టపాసులపై ఆంక్షలు విధించని ప్రభుత్వం

ఏటా దీపావళి రోజు గాలి నాణ్యత క్షీణించడం, శబ్ద కాలుష్యం పెరగడం పరిపాటి. ఈసారి మాత్రం దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా కాలుష్యం కమ్మేసింది. నాలుగు గంటల పాటు నగరంపై విషపుగాలి ఆవరించేసింది. గత ప్రభుత్వ హయాంలో వివిధ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా అందించడంతో బాణసంచా అమ్మకాలు బాగానే జరిగేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అర్హులైన లబ్ధిదారులకు ఒక్క రూపాయి కూడా పథకాల ద్వారా చేరకపోవడంతో జనంలో కొనుగోలు శక్తి సన్నగిల్లింది. దీంతో బాణసంచా అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. 2023లో సుమారు రూ.30 కోట్ల వరకూ బాణసంచా విక్రయాలు జరగగా.. ఈ ఏడాది మాత్రం రూ.25 కోట్లు వరకూ విక్రయాలు జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అమ్మకాలు చూస్తే కాలుష్యం కూడా తగ్గుతుందని అంతా భావించారు. అయితే గతేడాదితో పోలిస్తే కాలుష్యం మాత్రం ప్రమాదకర స్థాయికి చేరుకుందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) వెల్లడించింది.

నాసిరకం టపాసులే కారణం

గతేడాది జరిగిన దీపావళి పండగ నగరాన్ని గ్రీన్ జోన్‌లోనే ఉంచింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు దీపావళి రోజున వెలువడే కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. దీంతో దీపావళి సందర్భంగా గతేడాది విశాఖలో నగరంలో నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) సాధారణం కంటే స్వల్పంగా మాత్రమే నమోదైంది.

ప్రజలు ఎక్కువ శాతం గ్రీన్ క్రాకర్స్‌నే వినియోగించడం వల్ల.. ఇది సాధ్యమైంది. ఈసారి మాత్రం ఆ అవగాహన కానీ గ్రీన్ క్రాకర్స్ కానీ కనిపించలేదు. తక్కువ కాలుష్యం కలిగించే బాణసంచాలో బేరియం, అల్యూమినియం, పొటాషియం నైట్రేట్ వంటి కాలుష్యం కలిగించే రసాయనాలు అతి తక్కువ మోతాదులో ఉంటాయి. మాములు టపాసుల కంటే వీటితో దాదాపు 30 శాతం తక్కువ కాలుష్యం కలుగుతుంది. కానీ ఈసారి ఈ తరహా టపాసులు మార్కెట్‌లో ఎక్కడా కనిపించలేదు. మొత్తం.. నాసిరకమైన టపాసులే దర్శనమిచ్చాయి. ప్రభుత్వం టపాసుల విక్రయాలపై ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో.. విచ్చల విడిగా.. కాలుష్యానికి కారణమయ్యే బాణాసంచానే విక్రయించారు. ఈ కారణంగానే.. గాలినాణ్యత ప్రమాదకర స్థాయికి చేరుకుంది.

500కి చేరుకున్న పీఎం 2.5

కేంద్ర కాలుష్య నియంత్ర మండలి ప్రొటోకాల్ ప్రకారం పండుగకు ముందురోజు, పండుగరోజున కాలుష్య తీవ్రతలను నమోదుచేశాయి. సాధారణ రోజులతో పోల్చినప్పుడు మాత్రం గాలినాణ్యతలో భారీగా హెచ్చులు ఉన్నట్లుగా సీపీసీబీ నివేదిక ప్రకటించింది. పటాసులు కాల్చడంతో గాలిలో దుమ్మూధూళి కణాలు కలిసి గాలినాణ్యతలో ముఖ్యంగా పీఎం స్థాయిలు భారీగా లోపించినట్లుగా తేల్చింది. పర్టిక్యులేట్ మ్యాటర్(పీఎం) 2.5 సాధారణంగా 60 ఉంటుంది. అదేవిధంగా పీఎం –10 100 ఉండాలి. ఇందులో భారీగా పెరుగుదల కనిపించింది. గురువారం రాత్రి 8 గంటల తర్వాత 11 గంటల వరకూ 400కి పైగానే పీఎం 2.5 నమోదు కావడం ఆందోళనలకు గురిచేస్తోంది.

300 దాటి భయపెట్టిన పీఎం –10 నాణ్యత

నగరంలో గాలి నాణ్యత భారీగా పడిపోయిందని ఏపీపీసీబీ ఆందోళన వ్యక్తం చేసింది. పీఎం–10, పీఎం–2.5 లెవెల్స్ ప్రమాదకరంగా ఉన్నాయని ఏపీపీసీబీకి చెందిన మొబైల్ పొల్యూషన్ మోనటరింగ్ వెహికల్ నమోదు చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీపావళి రోజున సగటు గాలినాణ్యత కంటే రెట్టింపు స్థాయిలో కాలుష్యం కమ్ముకుందని ఏపీపీసీబీ విశాఖ అధికారులు తెలిపారు.

ప్రాంతం	దీపావళికి వారం ముందు (మైక్రోగ్రామ్స్ పర్ ఎం3)		దీపావళి రోజు (మైక్రోగ్రామ్స్ పర్ ఎం3)	
	పీఎం–10	పీఎం–2.5	పీఎం–10	పీఎం–2.5
మింది	121.0	45.0	301.0	121.0
ఆటోనగర్	122.0	44.0	241.0	84.0
పోలీస్ బ్యారెక్స్	124.0	66.0	274.0	131.0
ఈఎస్‌ఐ హాస్పిటల్	121.0	54.0	132.0	107.0
సీతమ్మధార	85.0	36.0	221.0	97.0
జ్ఞానాపురం	134.0	53.0	307.0	108.0
పెదగంట్యాడ	129.0	57.0	193.0	93.0
రాంకీ	115.0	46.0	149.0	76.0
ఎంవీపీ కాలనీ	89.0	32.0	266.0	122.0
జీవీఎంసీ	189.0	89.0	249.0	165.0
నగర సగటు	122.9	52.2	233.3	110.4

‘పేద ఖైదీలకు ఆసరా’పై అవగాహన అవసరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ
- యలమంచిలి సబ్ జైల్ తనిఖీ



యలమంచిలి సబ్‌జైల్ పర్యవేక్షకుడు ప్రసాద్‌తో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

యలమంచిలి రూరల్: జరిమానా, బెయిల్ రుసుం చెల్లించే ఆర్థిక స్తోమత లేక జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీలకు ఆర్థిక భరోసా కల్పించడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా అమలవుతున్న ‘పేద ఖైదీలకు ఆసరా’అనే పథకంపై జైలు అధికారులు, న్యాయవాదులకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. శుక్రవారం యలమంచిలి సబ్‌జైల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న 9 మంది ఖైదీలతో ఆమె మాట్లాడారు. ఎవరెవరు ఏయే కేసుల్లో రిమాండ్‌లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. రూ. 40 వేల్లోపు బెయిల్ ష్యూరిటీలు ఇచ్చిన రిమాండ్ ఖైదీలను గుర్తించి వెంటనే బెయిల్‌పై విడుదలయ్యేలా చేయాలని ఉపకారాగారం పర్యవేక్షకుడు, న్యాయవాదులకు సూచించారు. 9 మందిలో ఒక ఖైదీకి నిర్ణీత సమయం ముగిసి 4 నెలలు గడిచినా బెయిల్‌పై ఎందుకు విడుదల చేయలేదని పర్యవేక్షకుడు ప్రసాద్‌ను అడిగారు. ఇలాంటి ఖైదీలకు న్యాయమూర్తి డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేస్తారన్నారు. దీనిపై త్వరితగతిన తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మనీలాండరింగ్, ఎన్‌డీపీఎస్, ఉపా వంటి తీవ్ర నేరాలకు సంబంధించిన చట్టాల్లో అరెస్తయినా లేదా శిక్ష పడిన ముద్దాయిలకు పేద ఖైదీలకు భరోసా పథకం వర్తించదని స్పష్టం చేశారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్టు రిమాండ్‌లో ఉన్న నిందితులకు చెప్పారు. పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జైళ్లలో 18 నుంచి 22 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఖైదీల వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డులో పుట్టిన తేదీ కాకుండా ఇతర వయస్సు నిర్ధారణ ధ్రువపత్రాలను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. దీని వల్ల బాల నేరస్తులెవరూ జైళ్లకు వచ్చే అవకాశం ఉండదన్నారు. అనంతరం జైలు పరిసరాలు, ఖైదీలకు వడ్డించే ఆహారం, సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జైలు విజిటింగ్ లాయర్లు కె.ఎస్.దుర్గాప్రసాద్, పీవీ రమణ, బి.హరిశంకర్రావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ జోన్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఏయూ జట్టుకు కాంస్యం



సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన ఏయూ పురుషుల జట్టు

యలమంచిలి రూరల్: సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం పురుషుల జట్టు కాంస్య పతకం సాధించిందని జట్టు కోచ్ వై.పోలిరెడ్డి తెలిపారు. ఇటీవల చెన్నై ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఏయూ తరపున పాల్గొన్న ఏడుగురు సభ్యుల పురుషుల బ్యాడ్మింటన్ జట్టు విశేష ప్రతిభ కనబరిచింది. ఏడుగురు సభ్యుల వర్సిటీ జట్టులో ఐదుగురు విద్యార్థులు యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులే కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ ఆనందం వ్యక్తం చేశారు. వారిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఏడుగురు క్రీడాకారులను ఆలిండియా ఇంటర్ జోనల్ బ్యాడ్మింటన్ పోటీలకు సెలెక్టర్లు ఎంపిక చేసినట్టు కోచ్ పోలిరెడ్డి తెలిపారు. ఈ పోటీలు డిసెంబరులో రాజస్థాన్ జేజేఎం యూనివర్సిటీలో జరుగుతాయన్నారు. 4వ ఖేలో ఇండియా వర్సిటీ ఆటల పోటీల్లో కూడా వీరంతా పాల్గొనేందుకు అర్హత సాధించారని ఆయన తెలిపారు.

అదృశ్యమైన యువకుడి కథ విషాదాంతం



రాకేష్ మృతదేహం



రాకేష్ మెలిపాక (ఫైల్)

- శారదానదిలో మృతదేహం లభ్యం
- ఈఎంఐలు కట్టలేదని మందలించిన తల్లిదండ్రులు

మునగపాక: తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడి శారదానదిలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెలిపాకకు చెందిన ద్వారపూడి గోపి కుమారుడు రాకేష్(23) ఐటీఐ చదువుకున్నాడు. ఇటీవల ఫైనాన్స్‌పై బైక్ కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించి ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో గత నెల 30న సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి రాకేష్ బయటకు వెళ్లిపోయాడు. రాత్రికి రాకపోయే సరికి ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కలతో పాటు స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడి అదృశ్యం కింద కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు కూడా రాకేష్ కోసం శారదానదిలో గాలింపు చర్యలు చేయించారు. శుక్రవారం ఉదయం మెలిపాక శివారు చినయాదగిరిపాలెం సమీపంలోని శారదానదిలో రాకేష్ మృతదేహం కనిపించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రాకేష్ తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో గోపి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



సుధాకర్(ఫైల్)

నర్సీపట్నం: మున్సిపాలిటీ బీసీ కాలనీలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మరణించినట్టు టౌన్ ఏఎస్‌ఐ సాంబశివరావు తెలిపారు. మంత్రి సుధాకర్ దీపావళి పండగ రోజున ఇంటికి సీరియల్ లైటింగ్ ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురయ్యాడు. ఆయనను వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో చనిపోయాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

10 కేజీల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా 10 కేజీల గంజాయి తరలిస్తున్న ఇద్దర్నీ పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జి.మాడుగుల మండలానికి చెందిన కొండపల్లి లక్ష్మణరావు, కొండపల్లి చంద్రశేఖర్ గోనె సంచిలో 10 కేజీల గంజాయి వేసుకుని తరలిస్తున్నారు. స్థానిక చెరకు తూనిక కేంద్రం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులకు అనుమానం వచ్చి వారిని తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైకులు ఢీ : ముగ్గురికి గాయాలు

మాకవరపాలెం: రెండు బైకులు ఢీకొట్టుకున్న సంఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కొండల అగ్రహారం గ్రామానికి చెందిన పెట్ల రమేష్(26), లాలం శివ(26) రాచపల్లి వద్ద అన్‌రాక్ రిఫైనరీలో పనిచేస్తున్నారు. వారు విధులు ముగించుకుని గురువారం రాత్రి బైక్‌పై స్వగ్రామం వస్తున్నారు. నర్సీపట్నం వైపు నుంచి మరో బైక్‌పై వస్తున్న జి.కోడూరుకు చెందిన తోట నవీన్ ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నవీన్‌ను 108లో నర్సీపట్నం తరలించారు. మిగతా ఇద్దర్నీ స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు అందించి అనంతరం నర్సీపట్నం తరలించారు.

అదాని పవర్ ప్లాంట్‌తో రైవాడ, కోనాం ప్రాజెక్టులకు ముప్పు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న

దేవరాపల్లి: రైవాడ, కోనాం జలాశయాల ఆయకట్టు రైతులు మరోసారి పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు రైవాడ జలాశయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి స్థానిక విలేకర్లతో మాట్లాడారు. హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అదాని కన్ను రైవాడ, కోనాం ప్రాజెక్టులపై పడిందన్నారు. రైవాడ, కోనాం జలాశయానికి జీవనదులుగా ఉన్న శారదానది, చల్ల గెడ్డ, బొడ్డేరు ఉండటంతో దట్టమైన అటవీ ప్రాంతాన్ని అదాని ఎంపిక చేసుకున్నారన్నారు. అనంతగిరి మండలం పరిధిలో అదాని హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుతో వేలాది ఎకరాలకు సాగు, తాగు నీరందించే రైవాడ, కోనాం జలాశయాలకు ముప్పు పొంచి ఉందని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పవర్ ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే త్వరితగతిన అనుమతులు ఇచ్చేస్తున్నాయన్నారు. రెండు జలాశయాలు అదాని చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదముందని, దీంతో గిరిజనులు దుర్భర జీవితాలను గడపాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఆయా జలాశయాల ఆయకట్టు భూములు ఏడారిగా మారడం ఖాయమన్నారు. అదాని కంపెనీ ప్రతినిధులు దేవరాపల్లిలో ఆఫీసుల నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభించారన్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఒమ్మలి విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలుకు ఎంపిక అయిన విద్యార్థినీలు

మాడుగుల రూరల్: రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఒమ్మలి జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థినులు ఎంపికయ్యారు. గత నెల 29న అచ్యుతాపురం మండలం హరిపాలెం హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో పదో తరగతి విద్యార్థిని ఎస్.గుణసాయి రమ్య, అండర్–14 విభాగంలో 9వ తరగతి విద్యార్థిని యు.గీతామాధురి సత్తా చాటారు. వీరిద్దరూ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం జగన్మోహన్‌నాయుడు తెలిపారు. వారిని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె.వెంకట్రావు, ఉపాధ్యాయులతో పాటు సర్పంచ్ సుంకర సింహాచలంనాయుడు, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు అభినందించారు.

ఆర్‌బీఐ-90 క్విజ్‌లో విద్యార్థినుల ప్రతిభ



బహుమతులు అందిస్తున్న ఆర్‌బీఐ ప్రతినిధులు

పాయకరావుపేట: ఆర్‌బీఐ–90 క్విజ్ పోటీల్లో స్ప్రెసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటారు. ఆర్‌బీఐ వార్షికోత్సవం సందర్భంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం గత సెప్టెంబర్ 19, 21 తేదీల్లో దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ క్విజ్ స్క్రీనింగ్ పోటీలు నిర్వహించారు. ఏపీ నుంచి ఎంపికైన 90 క్విజ్ టీమ్‌లకు అక్టోబర్ 28న విజయవాడ నోవాటెల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు జరిపారు. ఈ పోటీల్లో 6 టీమ్‌లను ఫైనల్ రౌండ్‌కు సెలెక్ట్ చేశారు. ఈ ఫైనల్ రౌండ్‌లో స్ప్రెసెస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న కుమారి ఎస్.దేవి, జి.సత్య విజయ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచి రూ.1.5 లక్షల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నారు. కళాశాల అధినేత నరసింహారావు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ రూ.5 వేలు చొప్పున చెక్కులు అందజేశారు.

యోగా పోటీల్లో వమ్మవరం విద్యార్థి సత్తా



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన తబిత జ్యోత్స్న

ఎస్.రాయవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వమ్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని తబిత జ్యోత్స్న ఎంపికైంది. ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగిన యోగా పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచిందని ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్ తెలిపారు. ఆమెను శుక్రవారం పీడీ జి.కిరణ్‌కుమార్, ఉపాధ్యాయుడు కె.రామకృష్ణ, తదితరులు అభినందించారు.

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు



జాలంపల్లిలో దగ్ధమవుతున్న ఇల్లు



మెటల్ స్టోర్స్ దుకాణంలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



క్యారీ లారీక్యాబ్‌లో మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదాల్లో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అనకాపల్లి: స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్‌కు సమీపంలోని శ్రీవర ఎంటర్ ప్రైజెస్ అండ్ మెటల్ స్టోర్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మెటల్ స్టోర్స్ అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారి పి.నాగేశ్వరరావు తమ సిబ్బందితో మూడు ఫైరింజన్ల సహాయంతో సుమారుగా 2 గంటల పాటు శ్రమించి మంటలు అదుపు చేశారు. సుమారుగా ఆస్తి నష్టం రూ.25 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. షాపు యాజమాని పి.వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అగ్నిమాపకశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

క్వారీ లారీ క్యాబిన్‌లో అగ్ని ప్రమాదం

అనకాపల్లి: మండలంలో మార్టూరు పంచాయతీ మాకవరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున శ్రీకృష్ణ స్టోన్ క్రషర్‌కు చెందిన లారీ క్యాబిన్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా క్యాబిన్ మొత్తం దగ్ధమైంది. సంఘటనా స్థలానికి అనకాపల్లి అగ్నిమాపకశాఖ అధికారి పి.నాగేశ్వరావు తమ సిబ్బందితో హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో లారీలో ఎవరూ లేరు. సుమారుగా రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా. లారీ ఓనర్ ఆర్.వి.సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్నిమాపకశాఖ అధికారి పి.నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

జాలంపల్లిలో రెండిళ్లు దగ్ధం

మాడుగుల: మండలంలో జాలంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండుళ్లు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యడ్ల సతీష్, ముచ్చకర్ల భూలోకతల్లీ పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్లలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విద్యుత్ మీటర్లు, నిత్యావసర సరకులు, సుమారు 30 ధాన్యం బస్తాలు, దుస్తులు, టీవీ, తదితర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న మాడుగుల అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో చుట్టు పక్కలకు మంటలు వ్యాపించలేదు. స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, స్థానిక వీఆర్వోలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

క్లుప్తంగా

కోలాహలంగా నరకాసుర వధ



అగ్నికీలల్లో దగ్ధమవుతున్న నరకాసురుని ప్రతిమ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద గురువారం రాత్రి దీపావళి సందర్భంగా భక్తుల కేరింతల మధ్య నరకాసురుని వధ కోలాహలంగా జరిగింది. 15 అడుగుల నరకాసురుని ప్రతిమను గవరపాలెం పురవీధుల గుండా ఊరేగించి, ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ నిప్పంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది నరకాసుర వధ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహ నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు మారిశెట్టి జగన్నాథరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి మాతకు కరెన్సీ అలంకరణ



కరెన్సీ నోట్ల అలంకరణలో అయ్యప్ప పీఠం

తుమ్మపాల: పట్టణంలో గవరపాలెం శ్రీ గౌరీ రైతు సంఘ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పీఠంలో దీపావళి పర్వదినాన స్వామి, ధనలక్ష్మి మాతను కరెన్సీ నోట్లతో స్వాములు అలంకరించారు. 108 కాయిన్లతో లక్ష్మీదేవికి అష్టోత్తర నామావళి చేపట్టారు. గురుస్వామి కొణతాల అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా పూజ నిర్వహించి అయ్యప్ప మాల భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్తీక మాసం మొదలు కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన గురుస్వాములు మల్ల నరసింగరావు, కాండ్రేగుల సీతారాం బాబ్జి (దాసు), కొణతాల పూర్ణచంద్రరావు, మాలధారణ భక్తులు భారీ దీపాలంకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మల్ల సురేంద్ర, కొణతాల అప్పలనాయుడు, యల్లపు చక్రవర్తి, కాండ్రేగుల శ్రీను, బుద్ధ శ్రీనివాసరావు, మద్దాల బోగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 2329 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,200	4,860
మొదటి రకం	4,010	5,000
రెండో రకం	3,420	4,580
మూడోరకం	3,000	3,400

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వెట్టయాన్	: షిర్డిసాయి
బఘీర	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీభాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 57 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.



గవరపాలెం భోగలింగేశ్వరస్వామి



వేల్పులవీధి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం



సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయం



గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయం

శివ పూజలకు వేళాయె

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- ముస్తాబైన శివాలయాలు



కాశీవిశ్వేశరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం



నాయుడుపేట సోహం ఆశ్రమంలో శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి: పట్టణం, పల్లె ప్రాంతాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. శివాలయాలను అందంగా తీర్చిదిద్దారు. శనివారం తెల్లవారు జాము నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకూ కార్తీక మాసోత్సవాలకు శైవ, వైష్ణవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే ఆలయాలకు సున్నాలు, రంగులు వేశారు. ఈ మాసం హరిహరాదులకు ప్రీతికరం కావడంతో ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయం, కూరగాయల మార్కెట్ వద్ద గల సాధువుల ఆలయం, సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయం, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, చేపల బజారు వద్దనున్న సాంబశివుని ఆలయం, సుంకర మెట్ట సత్యనారాయణస్వామి ఆలయం, శారదానది ఒడ్డున ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, గాంధీనగరం శివాలయం, మండలంలో శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, మామిడిపాలెం, సిరసపల్లి, కూండ్రం, సీతానగరం తదితర ప్రాంతాల్లోని శివాలయాలు విద్యుత్ దీపాలంకరణతో ధగధగలాడుతున్నాయి.

ఆలయ ఈవోలు, కమిటీ సభ్యులు క్యూలైన్లతో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజుల పాటు రోజు ఉదయం స్వామివారికి పలు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం ఆలయ ధ్వజస్తంబాల వద్ద ఆకాశదీపం వెలిగించేందుకు అర్చకులు ఏర్పాట్లు చేశారు.

శారదాఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు..

స్థానిక శారదా నది ఒడ్డున మహిళా భక్తులు తెల్లవారు జాము నుంచి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. జీవీఎంసీ అధికారులు శారదా ఘాట్ వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. నదిలో ఉన్న వ్యర్థాలను శుభ్రం చేశారు. మహిళా భక్తులు స్నానమాచరించి, అక్కడే ఉన్న ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకుని బ్రాహ్మణులకు స్వయంపాకం, దీపదానాలు ఇస్తారు. వారు దుస్తులు మార్చుకునేందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు.

ప్రారంభం కానున్న కార్తీక మాస పూజలు..

కశింకోట: మండలంలో శనివారం నుంచి కార్తీక పూజలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా కశింకోటలోని శారదా నదిలో ప్రధానంగా మహిళలు వేకువ జామున స్నానాలు ఆచరించి మూడు చోట్ల వేంకటేశ్వరస్వామి ఆలయం, డీపీఎన్ హైస్కూలు వద్ద గల ఆలయం, వెలంపేట ఆలయాల్లో నెలకొల్పిన గౌరీపరమేశ్వరుల విగ్రహాలకు పూజలు చేస్తారు. అలాగే శివాలయం, గవరపేటలో వేంకటేశ్వరస్వామి, పెద్ద బజారు వద్ద ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయాలు, లక్ష్మీనృసింహస్వామి, కస్పావీధి సాంబశివుని ఆలయాలను ఎక్కువగా దర్శించుకుంటారు.

సుగర్ వ్యాధి నిర్మూలనలో యోగా పాత్ర అద్భుతం



యోగా గురువు పూజ్య స్వామి రిత్ దేవ్‌జీ మహరాజ్, దొరమ్మనాయుడు

తుమ్మపాల: సుగర్ వ్యాధిని మానవ శరీరం నుండి తరిమి కొట్టే సాధనలో భాగంగా యోగ అద్భుతంగా పని చేస్తుందని, యోగాతో శరీరాన్ని ఆయుధంగా మార్చుకుంటే ఆరోగ్యం మన సొంతమవుతుందని పూజ్య స్వామి రిత్ దేవ్‌జీ మహరాజ్ అన్నారు. పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 6 వరకు జార్జి క్లబ్‌లో ఉన్న పతంజలి యోగ సెంటర్‌లో సుగర్ వ్యాధి తగ్గించుకునేందుకు ఐదు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. పతంజలి యోగ్‌పీఠ్, హరిద్వార్, పూజ్య స్వామి రిత్ దేవ్‌జీ మహరాజ్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు శిక్షణ అందజేస్తారన్నారు. ప్రతిరోజు తెల్లవారి 5.30 నుండి 7.30 వరకు తరగతులు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు జి. మంగయ్యను 9848521738 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సబ్‌జైల్ పరిశీలన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి వెంకట శేషమ్మ

అనకాపల్లి: స్థానిక సబ్‌జైల్‌ను డీఎల్ఎస్ఏ కార్యదర్శి వెంకట శేషమ్మ శుక్రవారం పరిశీలించారు. జైల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటుపై జైలు అధికారులను అడిగారు. నిందుతులు ఎవరైనా లీగల్ సహాయం కోరిన వెంటనే సంబంధిత న్యాయ అధికారులకు నివేదించాలని, జువైనల్ నేరస్తులు ఉన్నట్లయితే సంబంధిత జైల్‌కు పంపించాలని తెలిపారు. వివిధ కేసుల్లో శిక్షలు అనుభవిస్తున్న ఖైదీల భద్రత విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ, న్యాయ సహాయకులు సాయిరాం పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులకు అవగాహన



ఇటుక ఘన పరిమాణం కనుక్కుంటున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో నిర్వహిస్తున్న గణిత శాస్త్రవేత్త శకుంతలాదేవి జయంతి వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు శుక్రవారం 'నిజ జీవితంలో గణితం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల గురించి వివరించారు. దీనిలో భాగంగా ఘనాకారంలో ఉన్న మట్టి దిబ్బ నుంచి తయారయ్యే ఇటుకల సంఖ్యను కనుక్కున్నారు. దీనివల్ల నిజ జీవితంలో గణితం ఉపయోగించడం గురించి తెలుసుకోవడంతో పాటు గణితం పట్ల ఆసక్తి పెరుగుతుందని ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి అన్నారు.

దివంగత ప్రధాని ఇందిరకు ఘన నివాళి



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కశింకోట: కశింకోటలో గురువారం దివంగత ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి సంతబయలు ఉన్న ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, నియోజకవర్గ సమన్వయకర్త బోయిన భానుమూర్తి, పార్టీ నాయకులు సూరా శ్రీనివాస్, కాళ్ల సత్యనారాయణ, సేనాపతి ఈశ్వరరావు, సూరిశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

ముగిసిన దీపావళి వేడుకలు



కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయానికి అందంగా విద్యుద్దీపాలంకరణ



వెలుగులు విరజిమ్ముతున్న చిచ్చుబుడ్డి

అనకాపల్లి: పట్టణ, మండలంలో దీపావళి వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. చిన్నారుల కేరింతల మధ్య దీపావళి నిర్వహించారు. ఉదయాన్నే స్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి గృహాల్లో పూజలు చేసుకున్నారు. మధ్యాహ్నం కుటుంబ సమేతంగా పిండి వంటలతో భోజనాలు చేశారు. సాయంత్రం ఇంటి ముంగిట, ద్వారాలకు ఇరువైపులా వీలున్న చోటల్లా నూనె దీపాలు వెలిగించి లక్ష్మీపూజ చేశారు. ప్రసాదాలు స్వీకరించి, కుటుంబ సమేతంగా చెరకు గడలతో దివ్వెలు వెలిగించారు. అనంతరం చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా బాణసంచా వెలిగించారు. రకరకాల బాణసంచాతో వీధులన్నీ మోత మోగించారు.



కశింకోటలో ఉత్సాహంగా బాణసంచా కొనుగోలు

కశింకోట: మండలంలో ప్రజలు దీపావళి వేడుకలను గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక గవరపేటలోని పెద్దగుమ్మం వీధి, డీపీఎన్ హైస్కూలు వద్ద, మేదర వీధిలోను నరకాసురుని బొమ్మలను బాణసంచా అమర్చి కాల్చారు. ఇవి ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. అలాగే గవరపేటలోని వేంకటేశ్వరస్వామి, శివాలయం, కస్పావీధి రామాలయం, సాంబశివుని ఆలయాల్లో ప్రమిదలతో దీపాలు వెలిగించి దీపార్చన చేశారు. దీపావళి సందర్భంగా మండల గ్రామాల్లో బాణసంచా అమ్మకాలు జోరుగా సాగాయి. యువతతో పాటు మహిళలు సైతం ఉత్సాహంగా బాణసంచా కొనుగోలు చేసి ఇళ్ల వద్ద ఉత్సాహంగా పిల్లలతో సహా కాల్చారు.

నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

అనకాపల్లి: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో బీఆర్టీ కాలనీలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి ఫార్మసిస్టుల కో ఆర్డినేటర్ రత్నాల ప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టులు అందిస్తున్న సేవలపై నిపుణులచే ప్రసంగాలు ఉంటాయన్నారు. విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఫార్మసీ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొంటారని, వృత్తిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు.

క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం



సిమెంట్ కంపెనీ పనితీరు వివరిస్తున్న ఉద్యోగి

మాకవరపాలెం: క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం అచ్యుతరామయ్య అన్నారు. ఎక్స్‌పోజర్ టూర్‌లో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులను కశింకోట మండలం బయ్యవరం వద్ద గల సాగర్ సిమెంట్ కంపెనీకి శుక్రవారం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కంపెనీ పనితీరు, సిమెంట్ తయారీ, ఎగుమతి, కంపెనీలో భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రినాథ్, కృష్ణకుమార్, త్రినాథరావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న నాగభూషణం

తుమ్మపాల: తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోరుతూ 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షతో దాన్ని సాధించిన స్వాతంత్ర్య సమరయోదుడు పొట్టి శ్రీరాములు అని సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం శుక్రవారం నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన హైస్కూల్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బల్లా నాగభూషణం మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, కొత్తుర్తి రామారావు, వూడా నాగేశ్వరరావు, పిరాట్ల నరసింహమూర్తి, వేగి త్రినాథ్, న్యాయవాది గోగుల ఓమ్ వరప్రసాద్, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న త్రినాథరావు, సత్యవతి దంపతులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో 104వ స్థూపాన్ని 1969లో నిర్మించగా నేటికి 55వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని వ్యాపారవేత్త గ్రంధి త్రినాథరావు, సత్యవతి దంపతులు నిర్వహించారు. కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నిలుపు మహోత్సవం



గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవంలో కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు గౌరీపరమేశ్వరుల అమ్మవారి నిలుపు మహోత్సవాన్ని గురువారం రాత్రి చేపట్టారు. అంతకు ముందు జాతీయ రహదారిలో వరి పొలంలో వరి దుబ్బును తీసుకు వచ్చి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసి, అక్కడి నుంచి గౌరీపర మేశ్వరులను గవరపాలెం పురవీధుల గుండా ఊరేగించి శుక్రవారం తెల్లవారు జామున అమ్మవారి ఆలయంలో నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు మాట్లాడుతూ కార్తీకమాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఆలయ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మి నాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పీవీవీ రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, కొణతాల చంద్రశేఖర్, మద్దాల శంకరరావు, పెంటకోట వెంకట సత్యనారాయణ, కోరుబిల్లి సత్యనారాయణ, పెంటకోట జగదీష్, కాండ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

కశింకోట: కశింకోటలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. అనకాపల్లికి చెందిన దంత వైద్యులు దిలీప్ కుమార్, పల్లవి చైతన్య హాజరై రోగులకు సేవలందించారు. ముందుగా రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి విశ్రాంత ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు వేదుల వెంకట శాస్త్రి, అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, కార్యదర్శి కానూరు గోపాలరావు, సంయుక్త కార్యదర్శి ఎ. కామేశ్వరరావు, విశ్రాంత ఎంఈవో నంబా రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలకు 98 అర్జీలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించగా 98 అర్జీలు వచ్చాయి. ఏనుగుతునిలో ఎక్కువగా 65, నూతలగుంటపాలెంలో 33 వంతున రైతులు అర్జీలు సమర్పించారు. భూముల కొలతల్లో హెచ్చు తగ్గులు, రీసర్వేలో లోపాలు వగైరా సరి చేయాలని కోరారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, సర్వేయర్ రామారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని తేగాడ, కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే దీపం పథకంలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమం మొదలవుతుందన్నారు. కొత్తపల్లి కాలనీలో రూ. 10 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మిస్తామన్నారు. తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, ఉగ్గిన రమణమూర్తి, మాజీ సర్పంచ్‌లు సిదిరెడ్డి సూర్యనారాయణ, బుదిరెడ్డి గంగయ్య, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు క్రషర్లకు చెరకు సరఫరా చేయొద్దు

చీడికాడ: సభ్య రైతులు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకును సరఫరా చేసి, కర్మాగారం అభివృద్ధికి సహకరించాలని గోవాడ సుగర్స్ కేన్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణమూర్తి సూచించారు. ఖండివరంలో రైతులకు శుక్రవారం ఫీల్డ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల నుంచి క్రషింగ్ ప్రారంభంకానున్నదని చెప్పారు. ప్రైవేటు క్రషర్లకు చెరకును సరఫరా చేయవద్దని కోరారు. చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరకు రైతులకు ప్రభుత్వం నుంచి తగినంత ప్రోత్సాహం లభించడం లేదన్నారు. గత ప్రభుత్వంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.89 కోట్లు విడుదల చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.సన్నిబాబు, స్కూలు కమిటీ మాజీ చైర్మన్ గెంజి కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు గెంజి స్వాతి బాలాజీ, స్థానిక వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షులు సుంకర కొండబాబు తదితరులు పాల్గొన్నారు.